# నాలుగు రోడ్ల కూడలిలో

అక్కడ నాలుగురోడ్లూ కలుస్తాయి.

ముఖ్యమైన సెంటరు-పట్టణానికి.

బస్సుకోసం పడిగాపులు పడివుండాలి.

పది నిముషాలకి ఒక బస్సు వస్తూనే వుంటుంది.

పోతూనే వుంటుంది.

జీవితాన్ని అమ్ముకుని ఆఫీసులో పని చేస్తూండేవాళ్లు వొకర్నొకరు తోసుకుంటుంటారు. ఇండ్లకు ముందుగా పోవాలని ఎంతసేపైనా నిలబడాలి.

నాకు ఇంటితొందర ఏమీ లేదు. పోనీలే పాపం, ఐదారు మైళ్లనుంచీ పొద్దున్నెప్పుడో ఎనిమిదింటికి బయలుదేరి వచ్చి వుంటారుకదా అని వాళ్ళంటే నాకు జాలి. ఇంటిదగ్గర వాళ్ళ పాపలు ఎదురు చూస్తుంటారు. వీళ్ళు వెళ్ళి హాయిగా విశ్రమించటానికి వీలు లేదుకదా-మళ్ళీ మార్కెట్‌కు పోవాలి. లేకపోయినా, ఏదో పని వుంటుంది. నాలాగా కుర్చీలో కూర్చుని వొక్క సిగరెట్ కాల్చుకుని ఈ జంఝాటమంతా కొంచెంసేపైనా మరచిపోవటానికి వీలుండదుకదా అని నేను వాళ్ళను చూసి జాలిపడుతుంటాను. యాభై యేళ్ళ ముసలాయనదగ్గరనుంచీ పాతికేళ్ళ కుర్రాడివరకు బస్సెక్కటాని

కంతగా ఎందుకు తహతహలాడుతారో నాకు అర్థంకాని విషయమైపోయింది. ఇది రోజూవుండే కార్యక్రమమేనాయె. ఇవాళ ఏమైనా క్రొత్తసంగతా ఇది? అయినా వాళ్లు అలానే రోజూ తోసుకుని, తొక్కుకుని నానా ఇదవుతారు. నేను మాత్రం నిశ్చింతగా పుడిలా నిల్చుని ఆకాశంలోకి చూస్తూ ఐదారు బస్సులు పోయేవరకూ కాలం గడిపేస్తాను. తరువాత ఎప్పుడో వీలు చూసుకుని రూమ్ చేరుకుంటాను.

ఇదీ నా అలవాటు;

దీనికి భంగం లేదు,

వాళ్లవలె తొందరపడవలసిన అవసరమూ నాకు లేదు.

వాళ్లకున్న అదృష్టాలలో ఒక్కటీ నాకు లేదు.

నాకోసం ఇంటివద్ద ఎదురుచూసేవాళ్ళు ఎవరూ లేరు.

నా ఆలనా పాలనా ఎవరూ పట్టించుకోరు.

నా రూమ్‌మేటు శంకరంమాత్రం పొద్దుపోయి రూమ్ చేరుకుంటే, సినిమాకు పోయినావా? అని యేడుపుముఖం పెట్టి అడుగుతాడు. వా డేడుపు వాడిది!

అంతేగాని తిండికోసమైనా నాకోసం కాచుకొని వుండడు. ఆ పనిపిల్ల తెచ్చిన క్యారియర్‌ను రెండు పెట్టె భాగించి ముందుగా తినేస్తాడు. ఎప్పుడో నేను పోయి, ఆ చల్లారి పోయిన పదార్థాలని రుచి చూడాల్సి వుంటుంది. అప్పు డప్పుడు నాకు కోప మొస్తుంటుంది. దిగులు వేస్తుంది. ఎవరి

కోసమసి ఇంత శ్రమపడాలి! ఎవరికోసం బ్రతకాలి? ఎందు కిలా రోజులు గడిచిపోతున్నాయి అని ప్రశ్నించుకుంటాను.

సరే మరి ఎవరికెలా రాసిపెట్టివుందో అలానే జరుగు తుందిమరి అని శుష్క వేదాంతాన్ని మననం చేసుకుని సరిపెట్టుకుంటుంటాను.

ఇలానే గడచిపోతున్నది జీవితం.

ఒకరోజు ఆనాలుగురోడ్ల కూడలిలో బస్సుకోసం అక్కడ చేరిన పదిమందిలో నేనూ వొకనిగా నిల్చున్నాను. ఆశ్చర్యం, నాబాల్య స్నేహితుడు రామారావు కన్పించాడు. నాకు కొండంత సంబరమైంది.

వాణ్ణిబరబరా ఈడ్చుకొని కాఫీకి లాక్కుపోదామని ప్రయత్నించాను. వాడు ఏడుపుముఖం పెట్టి 'బస్సుపోతుంది' అని గునిశాడు. అయినా వాణ్ణి నేను వదిలిపెట్ట దలచలేదు. బాల్యస్నేహితుడాయిరి, ఎన్నోనాళ్ల తరువాత కనపడ్డాడు, నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది.

కాఫీ తాగుతూ వొక్కక్కటే విషయం అడిగి కనుక్కుం టున్నాను. అప్పటికే నాలుగుబస్సులు పోయినయ్. కాఫీ తాగే చోటునుంచి బస్ స్టాండు కనపడుతూనే వుంటుంది. టైమ్‌చూసి 'ఆరా!' అని గాభరా పడ్డాడు.

"ఏం అంత, ఏంమునుచుకుపోయిందోయ్! సినిమాకు వెళదాం ఇవాళ," అన్నాను.

వాడు విచారంగా ముఖం పెట్టి మళ్ళీ “నేనిక్కడే వుంటాను గదురా! ఇహ రోజూ కలుసుకోవచ్చును. మరెప్పుడైనా పోదాంలే” అన్నాడు.

“ఏమిటో మీ విశేషం?” అన్నాను.

“మా ఆవిడ ఎదురు చూస్తుంటుంది. నేను ఆలస్యంగా పోతే చిక్కు ముఖం వేసుకుని వుంటుంది పాపం” అన్నాడు.

నాకు అమాంతం హుషారువచ్చి వాడి వీపుమీాద గట్టిగా వొక్క చరుపు చరిచి ‘చెప్పావుకావు!’ అని సంతోషం ప్రకటించబోయాను. ఇంకా సంతోషం యెక్కువై హాయ్! హాయ్! అందామనికూడా అనుకున్నాను. కాని వాడిముఖం గొప్ప వేదాంతిముఖంలా మారిపోవటంతో కాస్త తగ్గి వివరించమన్నట్లుగా చూశాను.

“నిన్ను చూస్తే నాకు ఈర్ష్యగా వుందిరా” అన్నాడు మొట్టమొదటే.

“హారిపిడుగా! తాడూ బొంగరమూ లేకుండా వెయ్యేళ్లు ఘనంతో వర్ధిల్లే నాబోటివాణ్ణిచూసి నీకెందుకురా యీర్ష్య?” అన్నాను.

“నీకు దిగులూ చింతా లేదు. సంపాదించు కుంటావు. సంపాదించుకుంది నీ భాగం వరకైనా (తల్లిదండ్రుల భాగం వదిలేసి) నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకుంటావు. సినిమాకు పోదాం రమ్మని ఎంత నిర్విచారంగా నన్ను ఆహ్వానించావో

వాడు! నావిషయం అలాకాదే! అర్థాంగి అలుగుతుంది. నేనునీతో సినిమాకువస్తే,—నాయనా! నీకు నేనొక సలహా ఇస్తున్నాను విను. ఇప్పుడిప్పుడే ఈ రొంపిలో దిగకు. హాయిగా, నిర్విచారంగా వుండు. ఎందుకొచ్చిన బెడద ఇది! అబ్బ ఎంత కష్టపడుతున్నానో చెప్పలేను'' అన్నాడు.

బస్సువచ్చి ఆగింది ఒక్కఖాళీమాత్రమే వుందట. వాణ్ణి కాస్తా ఎక్కించి నేను ఆలోచనలో పడ్డాను.

నాకు ఈ మధ్య ప్రతివాళ్ళూ ఇదే సలహా ఇస్తున్నారు. ''ఆర్ యూ మేరీడ్?'' అని అడిగి, నేను లేదని తలవూపితే, నన్ను తెగ మెచ్చుకుంటున్నారు. ఎందుకో నాకు అర్థం కావటంలేదు. అంతకష్ట పరంపరలతో కూడుకొని వుంటుంది కామోసు వైవాహిక జీవితం! ఆఖరుకు మా అమ్మ కూడా ''ఆలూ బిడ్డా లేనివాడివి నీకెందుకు రా మనోవ్యధ?'' అని పాడటం వొకటి రెండుసార్లు విన్నాను. ఆలూ బిడ్డలూ వుంటే మనోవ్యధ వుంటుందా? ఛీఛీ ఇదేంపాట.

రామారావు కేం కష్టం వచ్చింది?

పెళ్ళయింతర్వాత పాత్రంలా బలిశాడు.

అయినా, ప్రతివాళ్ళకూ ఇది వొక ఫ్యాషనై పోయింది! ఫలాని పరీక్ష ప్యాసైన వాళ్ళు రొమ్ము విరుచుకుని అబ్బ ఆ పరీక్ష ఎంత కష్టం అని వర్ణిస్తారు. అంతేకాని ''భలే సులభం, చాలా తేలిక నువుకూడా కూర్చో పరీక్షకు'' అని

సలహా ఇవ్వరుకదా! ఈ పెండ్లిళ్ళు అయినవాళ్ళు కూడా అంతే. అందరికీ అలాంటి సలహాలు ఇస్తేకాని వాళ్లకు వోరకమైన తృప్తి వుండదు కాబోలు!

అయినా నా కిదంతా ఎందుకు?

ఊరికే రామారావు చెప్పిపోయిన దానిమీద ఇన్ని ఊహాతరంగాలు లేచినయ్.

ఆలస్యం ఎలాగూ అయిందికదా అని ఆవాళ సినిమాకు పోయాను. అక్కడ ఎంతమంది ఎంచక్కా చిరునవ్వులు చిందించుకుంటూ ఆలూ-మొగలూ సినిమాకు వచ్చారను కొన్నారు? అందులో తృప్తిలేనట్లేనా? ఏమో?

నాకు వాళ్ళనుచూస్తే ఏమిటోలా అనిపించింది. రూమ్ చేరుకునే సరికి తొమ్మిదైంది.

చెడ్డ ఉక్కగా ఉంది. బాత్ రూంలోకి పోయి కుళాయి కింద శరీరాన్ని చేరిస్తే చల్లటి నీళ్ళు దారగా శరీరాన్ని తడుపుతుంటే చలికి వణికిపోయాను.

అప్పుడు నా కనిపించింది.

రామారావు గుర్తొచ్చాడు.

చక్కగా వేణ్ణీళ్ళు పోసుకునివుంటాడువాడు.

వాళ్ళావిడ వీపురుద్ది వుంటుంది. ఎదురుగ్గాకూచుని అన్నం పెట్టి వుంటుంది. ఫలాని నవల్లో నాయకివలె ఇంకాస్త తినమని బ్రతిమిలాడి వుంటుంది. నాకునవ్వొచ్చింది.

వాడు చెప్పిన వేదాంతానికి. నా క్యారియర్ భోజనంలాంటిది కాదు వాడి జీవితం.

నేను రోజూ బస్సుదగ్గర వాడికోసం చూస్తూనేవున్నాను. అయితే ఆఫీసు వదలగానే వురుకులు పరుగులమీద వచ్చి తోక్కుకుని యుద్ధంచేసి బస్సులో వెళ్ళిపోతున్నాడులా వుంది.

తరువాత నాలుగు రోజులకు కన్పించాడు. శతగాత్రుడికి మల్లే. నే నేమీ అడక్కముందే "మూడు బస్సులు వెళ్ళిపోయాయి" అన్నాడు పెద్దవిచారంతో.

నాకు తమాషా చెయ్యాబుద్దేసింది.

"ఓరే నేను ఇవాళ వో పెళ్లి సంబంధం చూచివచ్చాను. పిల్ల బాగానే వుంది," అన్నాను.

వాడు సూటిగా ప్రశ్నించాడు :

" నీ జీతమెంత?"

"ఎనభై ఆరూ," అన్నాను.

" నాయనా నే చెప్పేది వినరా. నువుకూడా ఈ రొంపిలో దిగకు. నా హృదయపూర్వకమైన సలహా ఇది. ఎందుకు ఇరుక్కుంటావు? ఇంకా నాలు గేళ్ళు పోనీ—విను—విను" అని మొరపెట్టుకున్నాడు.

వాణ్ణిచూచి నాకు జాలైంది.

"అంతా తమాషారా" అన్నాను.

బస్సు వచ్చింది. వాణ్ణి లోపలికి నెట్టటానికి నేనూ శ్రమపడాల్సి వచ్చింది. నాకేంతొందర లేదు. నే నెప్పుడు వెళ్ళినా

షరవా లేదు. రామారావు వర్ణించినట్లుగా నాకు రొంపి లేదుగా మరి.

తరువాత నాలుగు రోజులకు రామారావు మళ్ళీ కన్పించాడు. తిరిగి అలానే విచారంగా ముఖం పెట్టి:

“మూడు బస్సులు వెళ్ళిపోయాయి” అన్నాడు. ఈసారి వాడంటే నాకు సానుభూతి లేదు. కారణం? చెబుతాను! వాడి చేతిలో అరిటాకు దొప్పతో సంపెంగ పూలున్నాయి. మంచివాసన పక్కనున్న నాకే మత్తు కలుగజేస్తున్నాయి. ఆ చేతిలో రెండే రెండు చక్రికేళీలున్నాయి. నన్ను చూశాడు కదా? ఒకటైనా నాకిస్తే నేం - పోనీ మాటవరసకు సంపెంగ పూలూ - చక్రికేళీలూ నాకెందుకు? నే నేం చేసుకుంటాను? చంకలో అందమైన అమ్మాయి ముఖచిత్రంతో వారపత్రిక వుంది. వాళ్ళు దాన్ని చదువుకుంటారు గామోసు.

నన్ను చూసి నవ్వి “భలేకథలు రాస్తున్నావుగాని, ఆ శృంగారమంతా కథల్లోనేరా నాయనా, సంసారమంటే రొంపి. మరేమనుకున్నావో, దీనిలోనూ నీ కథ వుందిరా, వుంది. మా ఆవిడకు చెప్పానులే. పెళ్ళికాలేదంటే ఆశ్చర్య పోయింది.”

వాడు తెగనవ్వుతున్నాడు. నాకు చిన్నతనమైంది. అయినా నేనూ నవ్వాను.

ఒక్క సంపెంగపువ్వు అడుగుదామనుకున్నాను.

అయినా నా కెందుకు—?

నాకు వాడు సంసారం రొంపి రొంపి అనటం మహా కోపం తెప్పించింది. ఏమిటో వీడి వుద్దేశం. గట్టిగా అడిగి తేల్చుకుందా మనుకున్నాను.

ఇంతలో బస్సు వచ్చింది.

మహా ఆత్రపడ్డాడు బస్సులో జొరబడటానికి.

ఆ రొంపిలోకి పోవటానికి ఎందుకో ఇంత ఆరాటం. ఒక్క క్షణం హాయిగా బయట వుండకూడదు ?

వాడు బస్సులో వెళ్ళిపోయాడు. తరువాత నేనూ ఒక బస్సులో పోయాను.

బస్సులో వున్నంతసేపూ నేను ఆలోచించాను. ఇంకా సంపెంగపూల వాసన నన్ను వెన్నాడుతూనేవుంది. రామా రావు నాకు నిజం చెప్పటంలేదా ? ఇందులో ఏదో రహస్య ముంది. వాడు నన్ను మోసగిస్తున్నాడు. వాడి జీతమూ ఎనభై ఆరు రూపాయలే !